విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

దేశానికి రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీడీ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది .ఈ సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పరిమి సాగర్ కుమార్, ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగ భరత్, పిసిసి సభ్యులు విఠల్ కుమార్, నూజివీడు, ముసునూరు మండల పార్టీ అధ్యక్షులు పల్లె ప్రసాద్, సూర్యదేవర ప్రసాద్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాంసింగ్, అడ్వకేట్ రవికిషోర్, సీనియర్ నాయకులు శౌరికుమార్, బి. శ్రీనివాసరావు, దేవరపల్లి వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో: పాలకొల్లు కాంగ్రెస్ కార్యాలయం, గాంధీ భవనంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల శివాజీ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజీవ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నరసాపురం నిడదవోలు రోడ్డులో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి, మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు బోనం వెంకట్రావు, షేక్ మహబూబ్ జానీ, వర్ధన కాసు, కొలుకులూరి అర్జునరావు, రొక్కాల బెన్నీపాల్, తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో : మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా కైకలూరు నియోజకవర్గం కైకలూరు తాలూకా సెంటర్లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కట్టా నాగరాజు గౌడ్, కైకలూరు మండల ఇన్‌చార్జి మంగిని బాబ్జి, కలిదిండి మండలం మండల అధ్యక్షులు కే సి రెడ్డి వెంకట్ శ్రీరామ్ కృష్ణ, మండవల్లి మండలం కాశీ విశ్వనాథ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్దిరాల సంజీవరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగుల గణపతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అరిగెల వెంకటేశ్వరరావు, రవి,ప్రకాష్,హుస్సేన్, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా విఠల్

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్ర ప్రదేశ్ బీసీ, ఓ బి సి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఎస్ పి అర్ విఠల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ప్రెస్ క్లబ్ కార్యాలయం నందు ఆదివారం ఏపీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంపావతి గోవింద్ అధ్యక్షతన సభ జరిగింది. అనంతరం జరిగిన ఎన్నికలలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన సభ్యులు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన రాష్ట్ర అధ్యక్షుడుగా ఎస్ పి అర్ విఠల్ కుమార్ , ఉపాధ్యక్షులుగా యాంద్రా మోహనకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా జామాను 26 జిల్లాల మద్దతుతో ఎన్నుకున్నట్టు ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ తెలిపారు. ఈ సందర్భంగా విఠల్ ను వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర సంఘ సభ్యులు అభినందించారు.

మొక్కలు నాటిన లయన్ జిల్లా గవర్నర్

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఉన్న చేబ్రోలు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం లయన్ జిల్లా గవర్నర్ పంకజాన్ పర్యటించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆవర ణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శీతాల సత్యనారాయణ, అడపా శోభ రాణి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర- తణుకు: పట్టణంలోని ప్రధమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులు పుస్తకాలు చదవడం,యోగా క్లాసులలో పాల్గొన్నారు.ఈ కార్యక్ర మంలో కరుటూరి విశ్వనాథం, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సాంస్కృతిక దినోత్సవం, జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంపై సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: ప్రపంచ సాంస్కృతిక దినోత్సవం, జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం పై శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. కళారంజిని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది దాశరథి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ జాతి ప్రగతికి సంస్కృతి ప్రతిబింబం లా నిలుస్తుంది అన్నారు.విభిన్న మతాలు,కులాలు,భాషలు,జీవన విధానాలు ,కట్టు,బొట్టు,ఆహార వ్యావహారాలతో కూడిన బిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తున్న భారతీయ సంస్కృతి మహోన్నతమైంది అన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయులు డి.రామ నాగేశ్వరరావు ఉగ్రవాదం పై మాట్లాడుతూ ఉగ్రవాదం అశాంతికి మూలం అని బాల్యం నుండి శాంతి పదంతో ఉంటే భవిష్యత్తు సుభిక్షం గా ఉంటుంది అని కోపం,కక్ష,క్రోధం అనునవి పగలను పెంచుతాయని దానితో మనశ్శాంతి పోయి జీవితాలు అస్త వ్యస్తం అవుతాయని అన్నారు. ఉగ్ర వాదం వద్దు శాంతి ముద్దు అన్నారు. కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, కలిగొట్ల గోపాల శర్మ , శ్యామల, డి. శ్యామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లి నాగేశ్వరరావు జీవితం నేటి తరానికి ఆదర్శం

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-ముసునూరు: కొల్లి నాగేశ్వరరావు పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు.మండలం లోని గుడిపాడు గ్రామంలో కొల్లి నాగేశ్వరరావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సంస్మరణ సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి కృషి చేసిన మరో ఆదర్శ మూర్తి పాటిబండ్ల శ్రీరామయ్య (ఏటికాలువ పంతులు) విగ్రహానికి కృష్ణ చైతన్య పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు గ్రంథాలయం వద్దపార్టీజండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీలో ప్రముఖులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కొల్లి నాగేశ్వరరావు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణ చైతన్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ అయన చేసిన పోరాటంలో ఆరు నెలలు జైలు జీవితంకూడా గడిపారన్నారు. కొల్లి అనువదించిన "జలదర్శిని" పుస్తకాన్ని ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆవిష్కరించి దానిలోని అంశాలను ప్రభుత్వం పరిగణ లోకి తీసుకొని అమలు చేసిందని కొనియాడారు. మాజీ ఎంపీపీ కొల్లి గంగ సత్యనారాయణ మాట్లాడుతూ కొల్లి నాగేశ్వరరావు తన యావదాస్తిని పార్టీ కే విరాళం ఇచ్చారని, వారి కుటుంబ సభ్యులు కూడా అదే భావజాలంతో కొనసాగడం అభినందనీయ మన్నారు. చలసాని రామారావు మాట్లా డుతూ పువ్వు పుట్టగానే పరిమళించినట్టు చిన్నప్పటి నుండే పోరాట పటిమతో కొనసాగుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఆయన చేసిన భూ పోరాటాలు మరువలేనివన్నారు. 1971 ప్రాంతంలో భూస్వాముల కబంధ హస్తాల నుండి భూములు విడిపించి పేదలకు పంపిణీ చేయడంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. గ్రామస్తులు మందలపు రాధాకృష్ణ మాట్లాడుతూ ఆయన గుడిపాడులో పుట్టి పెరిగి, జాతీయ స్థాయిలో సేవలందించడం గ్రామం గర్వించదగ్గ విషయం అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత కార్యనిర్వా హక కార్యదర్శి గద్దె రఘుబాబు, కూచిపూడి నాగేశ్వరరావు, జిల్లా రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, చాట్ల పుల్లారావు,పార్టీ కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

చింతలపూడిలో: కొల్లి నాగేశ్వరరావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని రైతాంగ సమస్యలపై పోరాడాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. కొల్లి నాగేశ్వరరావు 3వ వర్ధంతి సిపిఐ పట్టణ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కంచర్ల గురవయ్య మాట్లాడుతూ కొల్లి నాగేశ్వరరావు బాల్యం నుండి కమ్యూనిస్టు భావాలను ఆకళింపు చేసుకుని అన్యాయాలను ఎదిరించారన్నారు. ముసునూరు పాఠశాలల్లో, విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజ్

విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ సాగిన విశాఖ ఉక్కు ఉద్యమంలో విద్యార్థి నాయకునిగా కీలకపాత్ర వహించారని కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి రైతు రామచంద్రరావు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతి సభలో రైతు సంఘం మండల కార్యదర్శి దొంతా కృష్ణ, రైతు సంఘం నాయకులు తడికి మల్ల ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర -భీమవరం: 2008 డీఎస్సీ ద్వారా ఎంపికై మినిమం టైం స్కేల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యులను రెగ్యు లర్ చేయాలని ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. 2008 టైం స్కేల్ ఉపాధ్యాయులు ఆదివారం సాయి శ్రీనివాస్ ను కలిసి తమకు జరుగుతున్న అన్యాయం పై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో మినిమం టైమ్స్ స్కేల్ లో నియామకం చేసి కేవలం 10 నెలల కాలానికి జీతాన్ని చెల్లిస్తూ వేసవి సెలవుల్లో రెండు నెలలు కాలానికి జీతం లేకుండా ఖాళీగా ఉంచడం దారుణమన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు సిబ్బంది అందరికీ కేవలం ఒకరోజు బ్రేక్ ఇచ్చి పూర్తిస్థాయిలో 12 నెలల జీతాన్ని చెల్లిస్తున్నారని ఆ విధంగానే 2008 డీఎస్సీ ఎం టి ఎస్ ఉపాధ్యా యులను రెగ్యులర్ చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి సాయి వర్మ, జిల్లా అధ్యక్షులు జవహర్ లాల్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర రావు, ఆర్థిక కార్యదర్శి వి.జనార్దన్‌రావు, వై.వి.రామకృష్ణ, బి.మురళీకృష్ణ, ఎం.వెంకటరమణ, ఎం.నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు

విశాలాంధ్ర-అత్తిలి : వలంటీర్లు సంక్షేమ సారథులు అని రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగ దారుల వ్యవహారాలు శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు అన్నారు.ఆదివారం అత్తిలి మండలం అత్తిలి గ్రామంలో శ్రీ సుబ్రహ్మ ణ్యే శ్వర స్వామి కళ్యాణ మండపం వద్ద వరసగా మూడో ఏడాది వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయం ,వలంటీర్లు వ్యవస్థకు నాంది పలికి రాష్ట్ర ముఖ్య మంత్రి వినూత్న పాలనకు శ్రీకారం చుట్టారన్నారు.అత్తిలి మండలంలోని 370 మంది కి సేవా మిత్ర, 5 మందికి సేవ రత్న, 2 కు సేవా వజ్ర సర్టిఫికేట్లు, శాలువా, బ్యాడ్జి,మెడల్ లను మంత్రి కారుమూరి వాలంటీర్లు కు అందజేశారు.ఈ కార్యక్రమంలో అత్తిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బి. భరణి ప్రసాద్, ఎంపీటీసీ, ఎంపీపీ,జడ్పిటిసి, సర్పంచ్ ,వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని వారికి ప్రోత్సాహం

- చేసేవారికి నిరుత్సాహం

- 11 నెలలకే ఎంపీడీవోను ఎందుకు రిలీవ్ చేశారు

విశాలాంధ్ర - చాట్రాయి : గడచిన పదహారేళ్లుగా పంచాయతీలలో పనిచేస్తున్న అధికారిని బదిలీ చేయించలేదు. 11 నెలల క్రితం ఎంపీడీవో గా బాధ్యతలు తీసుకున్న ఎస్. మురళీమోహన్ ను ఎందుకు మార్పించారనేది చర్చనీయాంశమైంది. రాజకీయ నాయకుల ఆలోచనకు అనుగుణంగా తల ఊపకపోవడమే ప్రధాన కారణమని అంటున్నారు పలువురు.గత 11 నెలల క్రితం ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న ఎంపిడిఓ అనేక శాఖలలో పని విధానంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని జిల్లా స్థాయిలో చాట్రాయి మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని పలువురు అంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా మండల పరిషత్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేయడం వలన సూరంపాలెం మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడు విధులకు హాజరు కాకుండా వాలంటీర్ తో నడిపిస్తున్న విషయాన్ని ఆకస్మిక తనిఖీలో బయటకు తీసి జిల్లా కలెక్టర్ దగ్గర ప్రత్యేక గుర్తింపును పొందారు. మండల చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులు ఒకే రోజు 7 పాఠశాలలో తనిఖీ నిర్వహించి చరిత్రను సృష్టించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులుమొత్తం అప్రమత్తం అయ్యారు. పాఠశాలల పనితీరులో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థలో ప్రజలకు సచివాలయానికి మధ్య వారధిగా ఉన్న వాలంటీర్ల పని విధానం మెరుగు పరచడానికి నిర్లక్ష్యం గా వున్న 62మందికి ఒకేసారి హెచ్చరిక లు జారీచేసి పని విధానం మెరుగు పరచారు.జిల్లాలో 28మండలాలలో అట్టడుగులో వున్న చాట్రాయి మండలం అనేక అంశాలలో అగ్రభాగాన నిలవడం గమనార్హం.ప్రభుత్వ అంచనాలతో నిధులు మంజూరైపా పనుల్లో నాణ్యత పైన అనుమతి లేని ఇసుకతో ప్రభుత్వ రోడ్లు భవనాలు నిర్మాణాలపై కొందరి ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాల కోసం పని చేయడమే ఎంపిడిఓ కు శాపంగా మారిందా అనే చర్చలు వినవస్తున్నాయి. అదే సందర్భంలో గడచిన 16 సంవత్సరాల క్రితం పంచాయతీ కార్యదర్శిగా నియామకమైన ఒక అధికారి మండలంలో అతిపెద్ద శక్తిగా అవతరించారు.మండలంలోని 18 పంచాయతీల పరిధిలో కేవలం 4గురు పంచాయతీ కార్యదర్శులు ఉండగా అందులో ఒకరు ఏమైపోయారో నేటికీ అడ్రస్ లేరు.ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలకు వచ్చిన కోట్లాది రూపాయల నిధులను పెద్ద మొత్తంలో స్వాహా చేశారని అప్పట్లో గుసగుసలు వినిపించాయి.గ్రామ స్థాయిలో ఉన్న వైసీపీ నాయకులు పంచాయితీ ఎన్నికలలో గెలవాలనే ఏకైక లక్ష్యంతో అప్పులు చేసి పంచాయితీ పనులకు పెట్టుబడులు పెడితే వచ్చిన నిధులు అధికారులు అందినకాడకు బొక్కేసారని ఆరోపణలు వినిపించాయి. పని చేసే వారిని పక్కన పెట్టి పని చేయకుండా నిధులను కాజేస్తూ కబుర్లు చెప్పే వారికి ప్రోత్సహించడం ఏమిటనేది చర్చనీయాంశంగా మారుతోంది. ఇకనైనా ప్రభుత్వం దృష్టి సారించి పటిష్ట చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

గుండుగొలను వంతెనకు శంకుస్థాపన

విశాలాంధ్ర-భీమడోలు: గుండుగొలను వద్ద గోదావరి కాలువపై రూ. 3.5కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తో కలిసి స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకుస్థాపన చేసారు. కొల్లేరుకు ముఖ ద్వారంగా గత 120ఏళ్లుగా సేవలు అందించిన ఈ వంతెన ఇటీవల శిథిలమైపోవడంతో ఆ స్థానంలో ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టింది.ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యేలు వాసుబాబు, అబ్బయ్యచౌదరి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని, సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎంపిపి కనుమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఏఎంసి చైర్మన్ ఇంజేటి నీలిమా, గుండుగొలను పార్టీ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణరాజు, రావిపాటి సత్యశ్రీనివాస్, కొత్తగూడెం సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - నిడమర్రు: ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఉంగు టూరు శాసనసభ్యులు శ్రీని వాసరావు వాసు బాబు అన్నారు. ఆదివారం నవర త్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా నిడమర్రు మండలం, బావయపాలెం గ్రామానికి సంబంధించిన ఇళ్ల లబ్ధిదారులకు బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాలకు చొరవ చూపాలని, లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్,కిటికీలు,స్టీలు ప్రభుత్వమే అందచేస్తుందని అన్నారు. లే అవుట్ లో రహదారులు, విద్యుత్తు, త్రాగునీరు వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కేడే కాశీ ,ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అవకతవకలపై విచారణ

విశాలాంధ్ర -జంగారెడ్డిగూడెం: మండలంలోని నాగులగూడెం గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై గత సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు.ఆ గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనులకు రాని వ్యక్తుల పేర్లతో మస్తర్లు వేసి ఆ కూలీ డబ్బులు తీసుకున్నట్లు పలువురు ఫిర్యాదు చేశారు.దీంతో అధికారులు విచారణ చేస్తున్నారు. ఆదివారం ఉపాధి పనులకు సెలవు దినమైనా కొయ్యలగూడెం మండలానికి చెందిన కొందరు వ్యక్తులతో కలిపి గ్రామస్థులతో చేసిన పనినే మళ్లీ చేయిస్తూ ఫోటోలు తీసినట్లు పలువురు గ్రామ స్తులు తెలిపారు.ఫీల్డ్ అసిస్టెంట్ పై ఫిర్యాదు చేసిన ఫిర్యాదు దారులు ఆదివారం పని చేస్తున్న కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ఒక్క రోజు పనిచేస్తే వారం రోజులు పనికి రాకపోయినా మస్తర్లు వేస్తామని చెప్పారని,అందుకే ఆదివారం కూడా పనికి వచ్చామని గ్రామానికి చెందిన కూలీలు చెప్పారని తెలిపారు. సోమవారం ఏలూరులో జరిగే స్పందన కార్యక్రమంలో మరోసారి ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

దెందులూరు ఏఎంసీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-దెందులూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ దెందులూరు చైర్మన్‌గా అప్పన్న కనకదుర్గ ప్రసాద్ , కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గాన్ని రూ.2వేల 200 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు.అప్పన ప్రసాద్ సారధ్యంలో మార్కెట్ కమిటీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు, పంటల ఎగుమతులు, దిగుమతుల ద్వారా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కృషి చేస్తారన్నారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, అందించే దిశగా పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, శాసనసభ్యులు ఆళ్ల నాని, ముదునూరు ప్రసాద రాజు, తెల్లం బాల రాజు, పుప్పాల వాసు బాబు, ఉన్నమట్ల ఎలీజా, తలారి వెంకట్రావు,ఎం ఎల్ సి జయ మంగళ వెంకటరమణ,వంకా రవీంద్రనాద్, ఏ పి ఆయిల్ ఫెడ్ రైతుకమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు,పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేసిన సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి వేసవి వెల్ఫేర్ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర -ఏలూరు క్రైం : వేసవి తాపం నుండి ఏలూరు జిల్లా ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సంరక్షణకు ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి వేసవి వెల్ఫేర్ కిట్లను ఏలూరు రేంజ్ డీఐజీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కిట్స్‌లో ఎండ తీవ్రత నుండి కాపాడే సమ్మర్ హ్యాట్స్, సన్, కూలింగ్ గ్లాసెస్, చల్లదనం ఉంచే వాటర్ బాటిళ్లు, ఓఆర్ఎస్ ఎల్ ప్యాకెట్లు, రాత్రి సమయాల్లో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బందికి ప్రమాదాలు జరక్కుండా లైటింగ్ బ్యాటన్, రేడియం రిఫ్లెక్టింగ్ సేఫ్టీ జాకెట్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది నిత్యం మండుటెండలో విధులు నిర్వహించడం చాలా కష్టంగా ఉంటుందని, తీవ్రమైన ఎండల్లో దుమ్ము, ధూళి లెక్కచేయకుండా విధులు నిర్వర్తించే వారికి వేసవి తాపం నుండి స్వీయ రక్షణ చాలా అవసరమన్నారు. ఎండకు డీహైడ్రేషన్ కాకుండా నీరు బాగా తాగాలని, వడ దెబ్బ వంటి ప్రమాదకర పరిస్థితులకు లోను కాకుండా ఓ ఆర్ ఎస్ ఎల్, నిమ్మ రసం, మజ్జిగ లాంటి ద్రవాలు సేవించాలన్నారు. వేసవి కాలంలో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. వేసవిలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రజలకి మెరుగైన సేవలందించాలని, విధి నిర్వహణలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐబి అదనపు ఎస్ పి ఎన్ సూర్య చంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పి శేఖర్, డిఎస్పి కృష్ణంరాజు, ఎస్.బి సిఐ ఎం సుబ్బారావు,2,3 పట్టణ సిఐలు పి.చంద్రశేఖర్, వరప్రసాద్, ఒకటవ పట్టణ ఎస్ఐ రామకృష్ణ,ఏలూరు ట్రాఫిక్ ఎస్ఐ బుద్దల శ్రీనివాసరావు , శ్రీదర్ వేంకటేశ్వర రావు, నూజివీడు ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణ రెడ్డి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయికి చెల్లబోయిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర -భీమవరం: జస్టిస్ ఎ.వి.శేషసాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికవ్వడం భీమ వరంకే గర్వకారణమని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా నియమితులయిన జస్టిస్ ఎ.వి.శేషసాయిని భీమవరంలోని ఆయన స్వగృహం లో ఆదివారం చెల్లబోయిన రంగారావు కలిసి శుభాకాంక్షలు అందచేశారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ న్యాయ దేవత ముద్దు బిడ్డగా మీరిచ్చే తీర్పులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని యువ న్యాయవాదులకు స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఎఎల్ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.వి.ఆనంద్, మల్లుల శ్రీనివాసరావు, వీరవల్లి బాబ్జీ, గెద్దాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కలెక్టరేట్‌లో స్పందన

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం .10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం గం.10 గంటల నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పాలిసెట్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పాలిసెట్లో పెదతాడేపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలనుంచి ఇద్దరు విద్యార్థులు ర్యాంక్ లు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ బి. రాజారావు అన్నారు. పాఠశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంట్రపాటి దశ్వంత్ 4785, తేజ షణ్ముఖ్ 7113 ర్యాంకులు సాధించారని తెలిపారు. పాలిసెట్లో సీటు సాధించాలని కృషి పట్టుదలతో 10వ తరగతి పరీక్షలతో పాటు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఉపాధ్యాయులు చేసిన కృషికి ఫలితంగా పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ర్యాంకులు సాధించడం అభినందనీయం అన్నారు. పాలిసెట్లో విజయం సాధించిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు బాలాజీ, కృష్ణ, బలరామ్, వెంకటేశ్వరరావు, రవి, మాధవిలత, విజయరాజు, రాజకుమారి, సిబ్బంది, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

అభిమానుల మధ్య ధర్మరాజు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి, శ్రీ లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ చైర్మన్ పత్స పట్ల మట్ల ధర్మరాజు జన్మదిన వేడుకలు ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ లక్ష్మీ నారాయణ ఐస్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం వేలాదిమంది అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు.గణపవరం ,నిడమర్రు, భీమడోలు ఉంగుటూరు మండలాల నుండి జన సైనికులు మోటార్ సైకిల్ ర్యాలీగా వచ్చి తమ అభిమాన నాయకుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, నరసాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పీఏసీ సభ్యులు బొమ్మిడి నాయకర్ , కొవ్వూరు జనసేన నాయకులు టీవీ రామారావు తోపాటు జిల్లా నాయకులు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్మరాజుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసైనికులు వచ్చి బొకేలు పూలదండలతో ధర్మరాజును ముంచెత్తారు. అభిమానులు, బంధువులు 43 కిలోల కేకును కట్ చేయించారు. ఈ సందర్భంగా అభిమానులకు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఆరోగ్యంపై అవగాహనతో ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : ఆరోగ్యం పట్ల పిల్లలు అవగాహన పెంచుకోవాలని వైద్య సిబ్బంది తెలిపారు. లింగపాలెం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆరోగ్యంపై ఆదివారం పలు సూచనలు చేశారు. ఎండలో ఐస్ నీళ్ళు ఫ్రిజ్ నీళ్ళు తాగవద్దని అన్నారు. మజ్జిగ, పళ్ళ రసాలు, లస్సీ, సగ్గు బియ్యం జావలాంటివి తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో కాచి వడపోసిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దోమలు, ఈగలు దరి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లింగపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎఎన్ఎం, సిబ్బంది సి.హెచ్.శ్రావణి, బి.జ్యోతి, కె.నాగమణి, ఎ.రామకృష్ణ తదితరులు విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీషు పదాలు పలకటంపై చైతన్య స్కూలు ఉపాధ్యాయురాలు ఎన్.శిరీష నేర్పించారు. గ్రంథాలయ అధికారి లతీఫ్ పిల్లలు సెల్‌ఫోన్లు చూడవద్దని, పుస్తకాలు చదవటం, రాయటం అలవాటు చేసుకోవాలని తెలిపారు.

నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - లింగపాలెం : కొత్తపల్లిలో ఇటీవల అకాల మరణం పొందిన సక్కా నాగరాజు కుటుంబానికి స్థానిక తెలుగుదేశం నాయకులు చాకమూడి శ్రీను, అబ్బూరి శివరామయ్యలు రూ. 15 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు.